శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రాలు

- నిర్మాణాల ఊసెత్తని కూటమి ప్రభుత్వం
- అద్దె భవనాల్లోనే నిర్వహణ



కోడూరుపాడులో అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం



భట్లుపాలెంలో శిథిలావస్థలో ఉన్న పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

అల్లవరం: గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించి, మాతాశిశు మరణాలు నివారించేందుకు ఏర్పాటుచేసిన అంగన్‌వాడీ వ్యవస్థ నేడు లక్ష్యాన్ని చేరుకోవడంలో వెనకడుగు వేస్తోంది. అంగన్‌వాడీ భవనాలను శిథిలావస్థకు చేరుకోవడంతో కేంద్రానికి వచ్చే పిల్లలు, మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్‌వాడీ వ్యవస్థపై పర్యవేక్షణ లోపించింది. ప్రీ స్కూల్ పిల్లలకు అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో అద్దె భవనాలు, కార్యకర్త ఇళ్లల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించవలసి వస్తోంది. అమలాపురం నియోజకవర్గ వ్యాప్తంగా సగానికి పైగా కేంద్రాలను అద్దె భవనాలు, ఫ్రీ రెంట్ భవనాల్లో నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామంలో కనీసం ఒకటైనా అద్దె భవనం, ఫ్రీ రెంట్ భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించవలసిన పరిస్థితి ఉంది. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాల్లో చాలీచాలని సౌకర్యాలతో పిల్లలు ఇబ్బందులకు గురవుతున్నారు. అద్దె భవనాలు స్థానంలో కొత్త భవనాలను నిర్మించి ప్రీ స్కూల్ పిల్లలకు అందుబాటులోకి తీసుకురావల్సి ఉన్నా ఆ దిశగా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు.

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	సొంత భవనాలు	అద్దె భవనాలు	ఫ్రీ రెంట్ భవనాలు	నిర్మాణంలో ఉన్న కేంద్రాలు	శిథిలావస్థకు చేరిన కేంద్రాలు
అల్లవరం	76	41	30	5	2	4
అమలాపురం	91	37	37	17	5	3
ఉప్పలగుప్తం	68	28	28	12	1	1
మొత్తం	235	106	95	34	8	8

గత ప్రభుత్వం హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. ప్రీ స్కూల్ పిల్లలతో పాటుగా గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన, పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా నిర్ణీత వ్యవధిలో అందించారు. అంతేకాకుండా శిథిలావస్థలో ఉన్న భవనాలు తొలగించి వాటి స్థానంలో కొత్త భవనాలను నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు.

అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిర్మాణంలో ఉన్న భవనాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. నిర్మాణంలో ఉన్న కేంద్రాలను పూర్తి చేసి ప్రీస్కూల్ పిల్లలకు వినియోగంలోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. శిథిలావస్థలో ఉన్న కేంద్రాల స్థానంలో కొత్త భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల భవనాల స్థానంలో కొత్త భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన భవనాల నిర్మాణ పనులు నిధులు ఉన్నంత వరకు జరిగాయి. మళ్లీ నిధులు విడుదల అయితే మధ్యలో ఆగిపోయిన భవనాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తాం.

– వై.విజయశ్రీ, సీడీపీవో, అమలాపురం

8 ఏళ్ల తర్వాత తెరుచుకున్న రేషన్ దుకాణాలు



రేషన్‌షాపును ప్రారంభించిన ఎల్జీ కైలాష్‌నాథన్, సీఎం రంగసామి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా 8 ఏళ్ల తరువాత రేషన్ దుకాణాలు తెరుచుకున్నాయి. ఈ సందర్భంగా సోమవారం మెట్టుపాళయంలో రేషన్ దుకాణాన్ని ఎల్జీ కైలాషనాథన్, సీఎం రంగసామి ప్రారంభించారు. 2016లో రేషన్‌షాపులు మూసివేశారు. బియ్యం తదితర నిత్యావసర వస్తువులకు సంబంధించి మొత్తాన్ని రేషన్‌కార్డుదారుల బ్యాంకు అకౌంట్లలో నగదు బదిలీ చేసేవారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రజలనుంచి రేషన్‌దుకాణాలు ప్రారంభించాలని ఒత్తిడి రావడంతో ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో రేషన్‌షాపులు తిరిగి ప్రారంభిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో దీపావళికి ముందే రేషన్‌షాపులను ప్రారంభించి ఉచితంగా 10 కిలోల బియ్యం, రెండు కిలోల పంచదార పంపిణీ చేస్తామని సివిల్‌సప్లయిస్ శాఖ ప్రకటించింది. మళ్లీ రేషన్‌షాపులు తెరుచు కోవడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

'పీపీసీ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి'

అమలాపురం రూరల్: ఆర్‌బీకేల్లో పనిచేసిన పీపీసీ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. టీఏలు, డీఈవోలు, హెల్పర్‌గా అర్‌బీకేల్లో పౌర సరఫరాల శాఖ ద్వారా రబీ సీజన్‌లో గత ఏప్రిల్, మే నెలల్లో ధాన్యం కొనుగోలు విధులు నిర్వహించామని తెలిపారు. మూడు నెలలు అయిన జీతాలు ఇవ్వలేదని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సోమవారం కలెక్టర్‌కు వారు వినతిపత్రం అందించారు. జీతాలు తక్షణమే ఇవ్వాలని వారు కోరారు. టీఏకు 15వేలు, డీఈవో రూ12వేలు, హెల్పర్‌కు రూ. 9వేలు తక్షణ విడుదల చేయాలని వారు కోరారు. తమను రబీ సీజన్‌లో కొసాగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంతో నక్కా శ్రీనివాసరావు, కేపీ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురుస్వామి మృతికి సంతాపం

తాళ్లరేవు: మండల పరిధిలోని నీలపల్లి గ్రామానికి చెందిన గురుస్వామి మేర్నీడి సత్తిబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్ధనరావు, కాకినాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, డి.రామకృష్ణ, శ్రీవిద్య బాబి తదితరులు పరామర్శించి, ఓదార్చారు. గురుస్వామి సత్తిబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వరద బాధితులకు సీవీ రామన్ స్కూలు విరాళం

అమలాపురం టౌన్: ఇటీవల రాష్ట్రంలో సంభవించిన వరదల్లో నష్టపోయిన వారి సహాయార్థం స్థానిక సర్ సీవీ రామన్ స్కూలు రూ.లక్ష విరాళాన్ని సమకూర్చింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్‌ను విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆ స్కూలు డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు సోమవారం అందజేశారు.

నేడు అమలాపురం డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

అమలాపురం రూరల్: వికాస, టెక్ లాజిక్ ఆధ్వర్యంలో అమలాపురం ఎర్రవంతెన వద్ద గల ది అమలాపురం డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ రావిలాల మహేష్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని యువత వినియోగించుకోవాలని కోరారు.జాబ్ మేళాలో సుమారు 17 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, ఇంటర్వ్యూల్లో యువత పాల్గొని ఉద్యోగం సంపాదించుకోవాలని సూచించారు. అమలాపురం కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్టు వికాస జిల్లా మేనేజర్ గోళ్ళ రమేష్ తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

అల్లవరం: పల్లె పండగ లో భాగంగా ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సోమవారం భూమిపూజ చేశారు. బోడసకుర్రు,ఎంట్రుకోన, దేవగుప్తం, డి.రావులపాలెం, సామంతకుర్రు, ఎస్.పల్లిపాలెం, గుండెపూడి, రెల్లుగడ్డ, తూర్పులంక గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు చేపట్టారు.

నేడు ఓడలరేవులో గ్యాస్ బావుల అభివృద్ధిపై ప్రజాభిప్రాయ సేకరణ

అల్లవరం: జిల్లాలోని అల్లవరం మండలం ఓడలరేవులో ఓఎన్‌జీసీ టెర్మినల్ ప్లాంట్‌లో 10 ఆయిల్ బావులు, గ్యాస్ బావుల అభివృద్ధి, ఉత్పాదన, రెండు మానవ రహిత ప్లాట్‌ఫారమ్‌లు, పైపులైన్ ఏర్పాటుపై పర్యావరణ ప్రజాభిప్రాయసేకరణ చేపట్టారు. రూ.460 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై మేధావులు, ప్రజల నుంచి ప్రజాభిప్రాయ సేకరణను ఓడలరేవులోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల వేదికగా మంగళవారం ఉదయం 10 గంటలకు ఏర్పాటుచేశారు. మా మిడికుదురు, సఖినేటిపల్లి, రాజోలు, మల్కిపురం, అల్లవరం మండలాల్లోని గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరై తమ అభ్యంతరాలు తెలపవచ్చు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అమలాపురం టౌన్: స్థానిక నల్ల వంతెన సమీపంలో ఏరియా ఆస్పత్రి ప్రధాన రోడ్డులో సోమవారం మోటారు సైకిల్‌పై గుర్తు తెలియని ఓ యువకుడు అతి వేగంగా వచ్చి ఇద్దర్ని బలంగా ఢీ కొన్నాడు. ఈప్రమాదంలో ఓ మహిళ తలపై, మరోవ్యక్తి చేతికి గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన యువకుడు బైక్‌పైపరారయ్యాడు. క్షతగాత్రులు సమీపంలోనే ఉన్న ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నారు. పట్టణ ఎస్ఐ కిషోర్‌బాబును సంప్రదించగా రోడ్డు ప్రమాదా నికి సంబంధించి కేసునమోదుకాలేదని చెప్పారు.

క్రికెట్ పోటీలు వాయిదా

అమలాపురం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలయోగి స్టేడియంలో 22,23 తేదీల్లో జరగవలసిన అండర్ 14, అండర్ 17 బాలురు, బాలికల క్రికెట్ పోటీలు, సెలక్షన్స్‌ను వాయుగుండం కారణంగా వాయిదా వేసినట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ వెంకట శ్రీనివాస్ తెలిపారు. 23వ తేదీన ఇందుపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో జరగవలసిన అండర్ 17 బాలుర, బాలికల పవర్ లిఫ్టింగ్ పోటీలు కూడా వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు.

ఇనుప స్తంభాలను తొలగించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బండారులంక, కందులపాడు కాలనీవాసులు

అమలాపురం రూరల్: మండలం బండారులంక గ్రామపంచాయతీ పరిధిలోని కందులపాడు కాలనీకి వెళ్లే ప్రధాన మార్గంలో సీసీ రోడ్డుకు అడ్డంగా ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా అక్రమంగా పాతిన ఇనుప స్తంభాలను తక్షణం తొలగించాలని సోమవారం కలెక్టరేట్ వద్ద బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కందులపాడు కాలనీలో సుమారు 300 కుటుంబాలు నివసిస్తున్నాయని, కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డు మధ్యలో కొంతమంది ఆక్రమణదారులు ఇనుప స్తంభాలు పాతారని కాలనీ వాసులు తెలిపారు. దీంతో అనారోగ్య పరిస్థితులు ఏర్పడిన సమయంలో అంబులెన్స్ వెళ్లే అవకాశం లేకుండా పోయిందని చెప్పారు. తక్షణం ఇనుప స్తంభాలను తొలగించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు, కందులపాడు కాలనీవాసులు మంజుల, పద్మావతి, ఆర్.సత్యవతి, కనకదుర్గ దేవి,విజయలక్ష్మి, సూర్యకుమారి, సంఘాని లక్ష్మి, గూడాల దుర్గాభవాని, సీహెచ్ సత్యవతి, మోహన్ పాల్గొన్నారు.

మద్యం షాపును తొలగించాలని విద్యార్థినుల ధర్నా



ఈదరపల్లిలో మద్యం షాప్ తొలగించాలని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థినులు

అమలాపురం రూరల్: ఈదరపల్లిలో ఏర్పాటు చేసిన మద్యం షాపు తొలగించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థినులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. జనసేన పార్టీ రాష్ట్ర డాక్టర్ సెల్ విభాగం కార్యదర్శి కొప్పుల నాగ మానస ఆధ్వర్యంలో రవితేజ జూనియర్ కళాశాల విద్యార్థినులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ ఈదరపల్లి గణపతి థియేటర్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం షాపు వద్ద నిత్యం మందుబాబులు గొడవపడుతున్నారని, అధిక సంఖ్యలో వాహనాలు నిలిపివేసి ఉంటున్నాయని చెప్పారు. దీంతో కళాశాలకు వెళ్లే వచ్చే సమయంలో చాలా ఇబ్బందిగా ఉంటోందని తెలిపారు. మద్యం షాపును వేరే ప్రాంతంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో దుర్గాభవానీ, పి ప్రసన్న, వై.బాబి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళాలు



విరాళాలు అందించిన భక్తులను సత్కరిస్తున్న ఆలయ సిబ్బంది

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ వీరేశ్వర స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు సోమవారం ఇద్దరు భక్తులు విరాళాలు అందించారు. చిక్కాల గ్రామానికి చెందిన చిక్కాల సత్యనారాయణ, ఉమా దుర్గ భవానీ దంపతులు రూ.పది వేలు, నిడమనూరుకు చెందిన తాతనేని కృష్ణ చైతన్య దంపతులు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలను సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు. తొలుత వీరికి ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామల కుమార్ ప్రత్యేక దర్శనం చేయించి, అనంతరం ఆలయ మర్యాదలతో శేష వస్త్రం, స్వామి వారి చిత్ర పటం, ప్రసాదం అందజేసి సత్కరించారు.

గురుకుల పాఠశాల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంపీ హరీష్‌మాధూర్‌కు వినతి పత్రం అందజేస్తున్న స్కూలు కమిటీ సభ్యులు

ముమ్మిడివరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈమేరకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ నల్లా వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు హరీష్‌మాదూర్, కలెక్టర్ మహేష్‌కుమార్‌కు అందజేశారు. పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులు చదువుతున్నారని కనీసం వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. స్కూల్ ఆవరణ లోతట్టుగా ఉండడంతో తుప్పలు, పిచ్చి మొక్కలు పెరిగి విష సర్పాలతో భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఆట స్థల ఆవరణ ఆధునికీకరణ, ఆర్వో ప్లాంటు,పాఠశాల చుట్టూ ప్రహారీ, ఎల్‌ఈడీ బల్బులు, డ్రైనేజీ వ్యవస్థ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో దాకే సత్తిబాబు, పినిపే దివ్య భారతి, ఎస్.హైమావతి,లంక వరప్రసాద్, బీర అన్నవరం, ఎం.వి. సూర్యం, వడ్డి శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్టు నగర పంచాయతీ ఇన్‌చార్జ్ కమిషనర్ కె.సత్యనారాయణ తెలిపారు. కొత్త ఆధార్ కార్డులు, ఆధార్ కార్డుల్లో మార్పులు తదితర అంశాలకు సంబంధించి ఈనెల 22నుంచి 25 తేదీ వరకు ఈక్యాంపులు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈనెల 22న గొల్లల వీధి, పోలమ్మ చెరువు సచివాలయాలకు సంబంధించి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోను, 23న బొండాయి కోడు తూము, రాయుడు వారిపాలెం సచివాలయాలకు సంబంధించి జెడ్పీబాలికల ఉన్నత పాఠశాలలోను, 24న ముమ్మిడివరం మున్సిపల్ కార్యాలయంలో, 25న సూరాయి చెరువు సచివాలయం వద్ద ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్టు తెలిపారు.

నివాస ప్రాంతంలో మద్యం షాపు తొలగించండి

కాట్రేనికోన: మండల పరిషత్ కార్యాలయానికి ఎదురుగా ఇళ్ల మధ్యలో ఉన్న మద్యం షాపును తొలగించాలని కాట్రేనికోనకు చెందిన సంగాని పల్లంరాజు కలెక్టరుకు గ్రీవెన్సులో ఫిర్యాదు చేశారు. మద్యం షాపులను నివాస ప్రాంతాలలో పెట్టడంతో మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడవలసి వస్తుందని పేర్కొన్నారు. జిల్లా ఎక్సైజ్ ఎస్పీ, కాట్రేనికోన తహసీల్దారు, ఎంపీడీవో, ఎక్సైజ్ సీఐలకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని తెలిపారు.

గ్రామంలో ఒకే సచివాలయం ఉండాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లు

అమలాపురం రూరల్: గ్రామంలో ఒకే సచివాలయం ఉండాలని, ఉద్యోగులు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సర్పంచుల సమైఖ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌కు సోమవారం అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామంలో సచివాలయాలు ఎక్కువగా ఉండడంతో ఉద్యోగులకు పనిలేకుండా పోయిందన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే తమ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌కు తెలియజేసినట్టు చెప్పారు. కోనసీమ జిల్లా సర్పంచుల సమైఖ్య అధ్యక్షురాలు నాగబత్తుల శాంతకుమారి, పి.గన్నవరం నియోజకవర్గ సర్పంచుల సమైఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, సర్పంచ్‌లు పెద్దిరెడ్డి రామచంద్రరావు, కరాటం ప్రసన్న ప్రవీణ్, పెనుమాల సునీత, గంగుమళ్ల ఏసుబాబు,గుత్తుల చిరంజీవి, సలాది బుచ్చిరాజు, పందిరి విజయ, జాలెం రమణకుమారి, జె.సావిత్రి వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

ఉచిత బస్సు హామీపై సీఎంకు పోస్టుకార్డులు



మహిళలతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిట్టిబాబు,నాయకులు

అమలాపురం టౌన్: ఉచిత బస్సు హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు అమలాపురం ఆర్టీసీ బస్సు స్టేషన్ నుంచి సోమవారం మహిళా ప్రయాణికులతో కలిసి పల్లె వెలుగు బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఉచిత బస్సు ప్రయాణం హామీ ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలంటూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో మహిళా ప్రయాణికులతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు పోస్టు కార్డులు రాయించారు. పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీను, పార్టీ పట్టణ అధ్యక్షుడు వంటెద్దు బాబి, పీసీసీ నాయకులు ముషిణి రామకృష్ణారావు, అయితాబత్తుల సుభాషిణి, గెడ్డం సురేష్‌బాబు, దేవరపల్లి రాజేంద్రబాబు, యార్లగడ్డ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై జలవనరులు, రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి 22 మండలాల తహసీల్దార్లు, ఆర్డీవోలు, జలవనరుల శాఖ ఇంజినీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై దిశా నిర్దేశం చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు జిల్లాలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో సెంట్రల్ డెల్టా, తూర్పు డెల్టా, ఆయకట్టు కింద ప్రాదేశిక డిస్ట్రిబ్యూటరీ సంఘాలు, నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయని చెప్పారు. ప్రాదేశిక నియోజకవర్గం వారీగా సర్వే నంబర్లను అనుసరించి రైతుల వివరాలతో ఎన్నికల జాబితా సిద్ధం చేయాలన్నారు. జాబితా తయారీలో ఏవైనా సందేహాలు వస్తే సంబంధిత జలవనరుల శాఖ ఇంజినీర్ల ద్వారా నివృత్తి చేసుకోవాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. మండల స్థాయిలో అధికారులను సమన్వయం చేసుకుని గడువులోగా జిల్లాలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలని సూచించారు. ప్రతి మండలానికి ఆధీకృత అధికారిగా ఉప తహసీల్దార్‌ను నియమించాలని, ఎన్నికల అధికారిగా జల వనరుల శాఖ ఇంజనీర్లను నియమించాలన్నారు. పోలింగ్ అధికారులు సహాయ పోలింగ్ అధికారులుగా సచివాలయ పరిధిలోని ఇసుక పాలసీ, ధాన్యం కొనుగోలు విధులు కేటాయించని సచివాలయం సిబ్బందిని నియమించాలని సూచించారు. ఏ ఒక్క ఉద్యోగికి రెండు మూడు బాధ్యతలు అప్పగించరాదని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ పరిపాలన అధికారి కె.కాశీ విశ్వేశ్వర రావు, జలవనుల శాఖ ఇంజినీరు,బి శ్రీనివాస రావు, కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమర వీరుల త్యాగాలు మరువలేనివి



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

ముమ్మిడివరం: పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని సీఐ మోహన్‌కుమార్ తెలిపారు. పోలీసుల అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ముమ్మిడివరంలో సోమవారం సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలా సాగర్ సిబ్బంది, విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమర వీరులకు జోహర్లు అంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో గుద్దటి జమి తోపాటు పలువురు పాల్గొన్నారు.

వైభవంగా విజయ బేతాళ స్వామి తీర్థం



పేరూరులో విజయ బేతాళ స్వామి వాహనాల ఊరేగింపు

అమలాపురం రూరల్: మండలంలోని పేరూరు గ్రామంలో శెట్టిబలజీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి విజయ బేతాళ స్వామి వారి తీర్థ మహోత్సవం వైభవంగా జరిగింది. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి పాటు పలువురు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ తీర్థం సందర్భంగా ఎత్తున భారీ బాణాసంచా కాల్చారు. డీజే బ్యాండ్లు, శక్తి వేషాలు, విచిత్ర వేషాలు, బుట్ట బొమ్మలు, గారడీలు నృత్యాలతో ఊరేగింపు ఆదివారం తెల్లవారుజాము వరకు సాగింది. వేలాదిగా ప్రజల తరలిరావడంతో రోడ్లు కిక్కిరిసిపోయాయి. రోడ్లకు ఇరువైపులా ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేయడంతో పాటు కార్లు, ఆటోలను ఊరేగింపులోకి అనుమతించడంతో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఈ ట్రాఫిక్‌లో చాలామంది మహిళలు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడ్డారు.

ఘనంగా గ్రామదేవత విగ్రహ పునఃప్రతిష్ట

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి గ్రామంలో సోమవారం శ్రీ మహిషాసురమర్దని దేవి అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా శిఖర దర్శనం, యాగశాలలు పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అమ్మవారు నిలువెత్తు రూపంలో సర్వాంగ సుందరంగా దర్శనమిచ్చారు. అనంతరం వేలాది మందికి భారీ అన్న సమారాధన నిర్వహించారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అమ్మవారిని దర్శించుకుని ఆలయ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

బదిలీ అయిన ఉద్యోగులకు సత్కారం

ఉప్పలగుప్తం: నంగవరం, సన్నవిల్లి గ్రామాల్లో పని చేసి బదిలీ అయిన ఉద్యోగులను సోమవారం ఘనంగా సత్కరించారు. బదిలీపై అయినవిల్లి మండలం వెలవలపల్లి వెళ్లిన పంచాయతీ కార్యదర్శి వీధి సత్యనారాయణ, కొత్తపేట మండలం పలివెల వెళ్లిన సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ గౌస్ మొహిద్దీన్ ఖాన్, గొల్లవిల్లి వెళ్లిన విద్యుత్‌శాఖ జేఎల్ఎం ఎస్.విజయ్‌లను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.నంగవరం సచివాలయంలో సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సన్నవిల్లి సర్పంచ్ చిక్కం పెదబాబు, ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజా కుమారి, పంచాయతీ వార్డు సభ్యులు కామిరెడ్డి నారాయణరావు, బుడితి వెంకటరావు,మాజీ సర్పంచ్‌లు శీలం సూరిబాబు,చేటకాయల సూర్యవతి, లంక సత్యనారాయణ గ్రామ పెద్దలు గుర్లింక చిన్న, ఆకుల వెంకటేశ్వరరావు, గుర్లింక వెంకటేశ్వరరావు,రాయపురెడ్డి నాగు, గుంట్రు సత్యనారాయణ, వీఆర్‌వో పి.బాలాజీ రావు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు, అప్‌డేషన్‌కు ప్రత్యేక శిబిరాలు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో ఎనిమిది వార్డు సచివాలయాల్లో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకూ ఆధార్ కార్డు అప్‌డేషన్, నమోదుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తెలిపారు. 22న మెట్ల కాలనీ, ఏవీఆర్ నగర్ వార్డు సచివాలయాలు, 23న వంటెద్దు వీధి, వడ్డిగూడెం వార్డు సచివాలయాలు, 24న కల్వకొలనువీధి, సూర్యానగర్ వార్డు సచివాలయాలు, 25న అశోక్‌నగర్, గొల్లగూడెం వార్డు సచివాలయాల్లో ఈ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కొత్త ఆధార్ కార్డుల నమోదుతోపాటు డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేస్తారని తెలిపారు. అలాగే ఆధార్ కార్డులో పేర్లు, చిరునామాలు తదితర చేర్పులు, మార్పుల కోసం అప్‌డేషన్ ప్రక్రియ కూడా నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ రాజు విజ్ఞప్తి చేశారు.